7న విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం

బర్కత్‌పుర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో ఈనెల 7న డిగ్రీ, పీజీ. ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం చేయనున్నట్లు బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ ఎం.ఆర్.వెంకట్రావ్ తెలిపారు. శనివారం ట్రస్ట్ బోర్డు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం జరిగిన పరీక్షలలో 80 శాతానికిపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఈ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. ఈనెల 7న ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బోర్డు ట్రస్టీలు పన్నాల విష్ణువర్ధన్, పిల్లి శ్రీనివాస్‌రావు, ఆకుల నగేష్, ఎలిగందుల దేవేందర్, రాఘవేందర్ పాల్గొన్నారు.

5న జాతీయ అవార్డు గ్రహీతల అభినందనసభ

చిక్కడపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ (ఏబీబీఎస్ఎస్) తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో జాతీయ అవార్డు గ్రహీతల అభినందన సభను ఈనెల 5వ తేదీ సాయంత్రం అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి టి.చక్రవర్తి తెలిపారు. ఏబీబీఎస్ఎస్ జాతీయ శాఖ నిర్వహించిన జాతీయ సాహిత్య సమ్మేళనంలో అవార్డులు పొందిన వారిని తెలుగు వర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానందరావు సత్కరిస్తారని సీనియర్ జర్నలిస్ట్ బైసా దేవదాసు, ఏబీబీఎస్ఎస్ తెలంగాణ శాఖ మహిళా విభాగం అధ్యక్షురాలు గోళ్లమూడి పద్మావతి పాల్గొంటారని వివరించారు.



వెంకటేశ్వర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న వల్లకాటి రాజ్‌కుమార్

పద్మశాలీలకు రాజకీయాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

ముషీరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలీ కులస్థులు 40 లక్షలకు పైగా ఉన్నారని, వారికి రాజకీయ, ఉద్యోగ రంగాల్లో జనాభా ప్రాతిపదికన సముచిత స్థానం కల్పించాలని పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో వేంకటేశ్వర్‌రావును కలిసి పద్మశాలీలకు అన్నిరంగాల్లో న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. పద్మశాలీలు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని పేర్కొన్నారు. చేనేతతో పాటు వివిధ వృత్తుల్లో ఉపాధి పొందుతూ... జీవితాలను గడుపుతున్నారని తెలుపుతున్నారు. పద్మశాలీలు ఆర్థికంగా బలపడేందుకు ప్రభుత్వం నుంచి రుణాలు అందేలా సహకరించాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పద్మశాలీలకు సముచిత స్థానం లభించేలా ప్రాధాన్యం కల్పించాలని కోరారు. పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాస్, కోశాధికారి బింగి నవీన్, రాజకీయ విభాగం అధ్యక్షుడు నాగేష్, సంఘం మెదక్ జిల్లా అధ్యక్షుడు జయరాములు, సంపత్ పాల్గొన్నారు.

రోడ్డుపై ఆక్రమణల తొలగింపు



బతుకమ్మకుంట వద్ద ఆక్రమణలను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

బర్కత్‌పుర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని శివంరోడ్, బతుకమ్మకుంట వద్ద రోడ్డు ఆక్రమణలను జీహెచ్ఎంసీ సిబ్బంది తొలగించారు. శనివారం డీఎంసీ మారుతిదివాకర్ సారధ్యంలో రోడ్డు పక్కన గుడిసెలు వేసుకుని ఇనుప సామాన్లు విక్రయిస్తున్న వారితో మాట్లాడి కూల్చివేతలను చేపట్టారు. రోడ్డుకు అడ్డుగా ఉన్న వస్తువులను తొలగించారు. ఈ సందర్భంగా డీఎంసీ మారుతీదివాకర్ మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి వారిపై కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. అంబర్‌పేట సర్కిల్ 16 పరిధిలోని డివిజన్ల 6లో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్, ఏఎంహెచ్‌వో హేమలత, అంబర్‌పేట ట్రాఫిక్ సీఐ లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం



పనులను పర్యవేక్షిస్తున్న పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ తెలిపారు. డివిజన్‌లోని అశోక్‌నగర్ స్ట్రీట్‌నెంబర్ 12 కాలనీలోకి అశోక్‌నగర్‌నాలా వరదముంపు సందర్భంగా వరదనీరు కాలనీలోకి రాకుండా నిర్మించిన రిటైనింగ్ వాల్ వద్ద వర్షపు నీరు నాలాలోకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన దారినుంచి వరదనీరు కాలనీలోకి చేరుతోందని స్థానికులు గురవుతున్న క్రమంలో వారి ఫిర్యాదు మేరకు స్పందించిన కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలాలో వరదనీరు అధికమైనప్పుడు మురుగునీరు కాలనీలోకి చేరకుండా ఫ్లాష్ వాల్ మిషనరీ పనిచేస్తుందని తెలిపారు. ఎన్నో రోజులుగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం చేపట్టినందుకు గాను స్థానికులు కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, సిబ్బంది, బీజేపీ నేతలు వినయ్‌కుమార్, కాలనీవాసులు పూర్ణచందర్, వెంకటరెడ్డి, కృష్ణంరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జీఎన్.కేశవ్ తదితరులు

నేటి నుంచి కాంగ్రెస్ విజయోత్సవాలు

రాంనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం పూర్తవుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించి విజయవంతం చేయాలని టీపీసీసీ కార్యదర్శి జీ.ఎన్.కేశవ్ పిలుపునిచ్చారు. శనివారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, పేదల ఇళ్లకు ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్ల పెంపు వంటి అనేక హామీలను సంవత్సర కాలంలోనే అమలు చేసిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. రాజకీయ లబ్ధి కోసమే బీఆర్ఎస్ దీక్షా దివస్ పేరుతో రాజకీయం చేస్తోందని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో కన్నా డానియల్, రామకృష్ణ ముదిరాజ్, మహ్మద్ ఖదీర్ అలీ, శంకర్, రాంబాబు పాల్గొన్నారు.



హెచ్ఐవీ బాధితులకు మందులు, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న పద్మావెంకటేష్

హెచ్ఐవీ బాధితులకు సాయం స్ఫూర్తిదాయకం

గోల్నాక, నవంబర్ 30 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ బాధితులకు అండగా నిలుస్తూ సహాయసహకారాలు అందిస్తున్న బేతేల్ గాస్పెల్ చర్చి, గో-ఇండియా సంస్థల సేవానిరతి అందరికీ స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సతీమణి, గోల్నాక డివిజన్ మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మావెంకటేష్ అన్నారు. శనివారం గోల్నాక డివిజన్‌లోని అన్నపూర్ణనగర్‌లోని బేతేల్ గాస్పెల్ చర్చి ఆధ్వర్యంలో గో-ఇండియా సంస్థ వారి సహకారంతో పాస్టర్ కె.సుధాకర్ అధ్యక్షతన 360 మంది హెచ్ఐవీ బాధితుల కోసం నిర్వహించిన మెడికల్ క్యాంపులో కాలేరు పద్మావెంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. హెచ్ఐవీ బాధితులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, నిత్యావసర వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో నిరీక్షణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ సంజయ్, జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి ఇంద్రకంటి శ్రీనివాస్‌గౌడ్, గో-ఇండియా సంస్థ డైరెక్టర్ కిరణ్‌పాల్, శారా క్రిసోలైట్, మేరీ ప్రిసిల్లా, నర్సింహులు, ఎ.వెంకటేష్, మెగా అశ్విని, రీజి, సోని, శ్రీనివాస్, యువ పాస్టర్ వరకుమార్, యేసురత్నం పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు నిత్యాన్నదానం

- ప్రతిరోజూ 700ల మందికి భోజనాలు





భోలక్‌పూర్ దేవునితోటలోని భవాని శంకర దేవాలయ ప్రాంగణంలో అన్నదానంలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

ముషీరాబాద్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధరించిన భక్తులకు ప్రతిరోజూ మధ్యాహ్నం అన్నదానం (భిక్ష) చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు భోలక్‌పూర్‌కు చెందిన చిరు వ్యాపారి కె.శ్రీనివాస్‌గౌడ్. భోలక్‌పూర్ డివిజన్ దేవునితోటలో ప్రసిద్ధిగాంచిన భవాని శంకర ఆలయ ప్రాంగణంలో ఎనిమిదేళ్లుగా అయ్యప్ప భక్తులకు భిక్ష అందజేస్తున్నారు. రోజూ 600 నుంచి 700ల మంది భక్తులకు మధ్యాహ్నం 12 గంటల వరకు భోజనాలు సిద్ధం చేసి వడ్డిస్తున్నారు. అయ్యప్ప భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి భిక్ష స్వీకరిస్తున్నారు.

రోజూ క్వింటాల్‌కు పైగా బియ్యం అవసరం

వంద నుంచి 150 కిలోల బియ్యం వండుతూ రోజూ 700ల భక్తులకు భిక్ష సిద్ధం చేస్తున్నారు. కూరలు, పచ్చళ్లతో సుచి రుచికరమైన భోజనాన్ని వడ్డిస్తున్నారు. డిసెంబర్ 17వ తేదీ వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

ఎనిమిదేళ్లుగా అన్నదానం



ఎనిమిది ఏళ్లుగా అయ్యప్ప భక్తులకు అన్నదానం చేస్తున్నాం. దాతల సహకారంతో పాటు సొంత డబ్బులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తూ అయ్యప్ప భక్తులకు నావంతు సాయం అందజేస్తున్నా. ఈ కార్యక్రమం వల్ల పేద, మధ్య తరగతి, ఉద్యోగరిత్యా బిజీగా ఉండే అయ్యప్ప భక్తులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

\- శ్రీనివాస్‌గౌడ్, నిర్వాహకుడు

భక్తులకు ఎంతో ఉపయోగం



నిత్య అన్నదానం అయ్యప్ప భక్తులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రతిరోజూ భిక్ష చేసేందుకు ఆలయానికి పెద్ద ఎత్తున అయ్యప్పమాలాదారులు వచ్చి భిక్షను స్వీకరిస్తున్నాం. శ్రీనివాస్ గౌడ్ నిర్వహించే ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శం.

\- వై శ్రీనివాస్‌రావు, అయ్యప్పమాలాదారుడు

నెల రోజుల పాటు ఉచితంగా భోజనాలు



ప్రతీ సంవత్సరం నెల రోజుల పాటు అయ్యప్ప భక్తులకు ఉచితంగా అన్నదానం నిర్వహిస్తారు. రోజూ ఇక్కడే భిక్ష చేస్తాం. రుచికరమైన వంటలు వడ్డించడంతో పాటు, తమకు సమయం కూడా కలిసివస్తుంది.

\- ప్రభాకర్, అయ్యప్పమాలాదారుడు

విద్యాభూషణ్ ఆదర్శనీయుడు

సంతాపసభలో కొనియాడిన పలువురు వక్తలు



విద్యాభూషణ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టంకశాల అశోక్, సతీష్‌చందర్, ఎన్.వేణుగోపాల్, జూలూరి

రాంనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రచయిత, జర్నలిస్టు, ప్రజలపక్షపాతి విద్యాభూషణ్ ఆదర్శనీయుడు పలువురు వక్తలు కొనియాడారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విద్యాభూషణ్ సంతాపసభ నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి ఝాన్సీ అధ్యక్షతన జరిగిన ఈ సభలో సీనియర్ పాత్రికేయులు టంకశాల అశోక్ మాట్లాడుతూ.. విద్యాభూషణ్ అసాధారణమైన జర్నలిస్టు అని, ప్రజల పక్షపాతిగా వార్తలు రాశాడన్నారు. సహచరుడుగా కలిసి పనిచేసిన అనుభవం ఉందన్నారు. సాధారణమైన వ్యక్తి అని ఆయన ఆలోచనలు చాలా గొప్పవని కొనియాడారు. సీనియర్ పాత్రికేయులు సతీష్‌చందర్ మాట్లాడుతూ విద్యాభూషణ్ నిబద్ధత కలిగిన నిజాయితీతో కూడిన జర్నలిస్టు అన్నారు. విప్లవ రాజకీయాలతో జీవితం ప్రారంభమై వృత్తి మారిన రాజకీయాలు వదలలేదన్నారు. వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ మాట్లాడు తూ విద్యాభూషణ్ మనల్ని విడిచి వెళ్లిపోతారని అనుకోలేదన్నారు. న్యూడెమోక్రసీ కార్యవర్గ సభ్యులు కె.గోవర్థన్, సీపీఐ ఎంఎల్ (మాస్ లైన్) కార్యదర్శివర్గ సభ్యులు ఎం.హన్మేష్‌లు మాట్లాడారు. తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ విద్యాభూషణ్ ప్రపంచీకరణకు వ్యతిరేకంగా సమాజాన్ని జాగృతం చేశారని కొనియాడారు. విద్యాభూషణ్ కుమారుడు ఆజాద్ మాట్లాడుతూ తన తండ్రి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుతానన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎల్.పద్మ, కె.ఎస్.ప్రదీప్, అనురాధ, అరుణ, ప్రవీణ్, విద్యాభూషణ్ కుమార్తె సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలు సీఎంఆర్ఎఫ్ ద్వారా లబ్ధిపొందాలి



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోపాల్

చిక్కడపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేదలు సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా లబ్ధిపొందాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శనివారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో 14 మంది లబ్ధిదారులకు సుమారు 6 లక్షల 50 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గాంధీనగర్, రాంనగర్ డివిజన్‌ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ముచ్చ రాకేష్‌కుమార్, కొండా శ్రీధర్‌రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, కడప సురేందర్, సాయికుమార్, మాదవ్, శ్యామ్‌సుందర్, ఎర్రం శ్రీనివాసగుప్తా, చిట్టి, రవియాదవ్, రాజేష్, కిరణ్‌కుమార్, టిల్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'సమాజసేవలో రాజ్‌నారాయణ సేవలు మరువలేనివి'



రాజ్‌నారాయణ ముదిరాజ్‌ను సత్కరిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

బర్కత్‌పుర, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో రాజ్‌నారాయణ ముదిరాజ్ సేవలు మరువలేనివని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన నివాసంలో సమాజ సేవకు అంకితమైన తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్‌ను సత్కరించి మాట్లాడారు. రాజ్‌నారాయణ ముదిరాజ్ ఇటీవల అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్ నుంచి అవార్డు పొందడం అభినందనీయమన్నారు. ఆయన సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. జి.సీతారామరాజు, వెంకటేష్ ముదిరాజ్, బత్తుల హేమంత్ పాల్గొన్నారు.

సమానత్వం, సమాజహితమే ఎమ్మార్పీఎస్ ఆశయం

రాంనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజ హితం కోసం సామాజిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను నిర్మూలించి సమానత్వం సాధిండమే ఎమ్మార్పీఎస్ ఆశయమని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు గణేశ్ మాదిగ అన్నారు. శనివారం రాంనగర్ చౌరస్తాలో నూతనంగా నిర్మించిన ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. 30 ఏళ్ల ఎమ్మార్పీఎస్ ఉద్యమం మందకృష్ణ మాదిగ తిరుగులేని సమర్థవంతమైన నాయకత్వానికి నిదర్శనమన్నారు. వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో ఎమ్మార్పీఎస్ ఉద్యమం విజయం సాధించిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి గజ్జెల రాజశేఖర్, నాయకులు గండి కృష్ణ, చిలక ఎల్లయ్య, రోషన్ వినయ్‌రావు, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.



ఫ్లై ఓవర్‌పై స్తంభించిన ట్రాఫిక్

అడిక్‌మెట్ ఫ్లైఓవర్‌పై జారిపడ్డ వాహనదారులు

రాంనగర్: నల్లకుంట పీఎస్ పరిధిలోని అడిక్‌మెట్ ఫ్లై ఓవర్‌పై శనివారం సాయంత్రం ఓ వాహనం నుంచి ఆయిల్ లీక్ కావడంతో అటువైపు వెళ్తున్న ద్విచక్రవాహనదారులు జారిపడి గాయాలపాలయ్యారు. దాదాపు 20 మంది వాహనదారులు జారిపడిపోవడంతో ఫ్లై ఓవర్‌పై ట్రాఫిక్ స్తంభించిపోయింది.

గృహిణి అదృశ్యం

బర్కత్‌పుర: శుభకార్యంలో పాల్గొనడానికి అత్తగారి ఇంటి నుంచి పుట్టింటికి బయలుదేరిన గృహిణి అదృశ్యమైంది. కాచిగూడ ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చప్పల్‌బజార్‌కు చెందిన రవళి(26)ని పాతబస్తీ దారుషిఫాకు చెందిన సాయివికాస్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. పుట్టింటిలో జరిగే శుభకార్యంలో పాల్గొనడానికి రవళి శుక్రవారం దారుషిఫా నుంచి ఓలా ఆటో బుక్ చేసుకుని చప్పల్‌బజార్‌కు బయలుదేరింది. అయితే రవళి పుట్టింటికి చేరలేదు. దీంతో ఆందోళన చెందిన భర్త కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ నేతల హెచ్చరిక

కవాడిగూడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వల్లభనేని ప్రసాద్, వి భారతి, ఉపాధ్యక్షుడు కె.వెంకటేష్‌గౌడ్‌లు ఆరోపించారు. గత ప్రభుత్వంలో దివ్యాంగులకు ఉన్న రూ.4016 పింఛన్‌ను తాము అధికారంలోకి వస్తే రూ.6 వేలకు పెంచడంతో పాటు దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఏడాది గడుస్తున్నా సంబరాలు చేసుకుంటుంది కానీ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను విస్మరించించిందని ఆరోపించారు. దివ్యాంగుల పింఛన్లు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరపార్కు ధర్నా చౌక్‌లో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పాల్గొన్న వల్లభనేని ప్రసాద్, భారతి, కె వెంకటేష్‌గౌడ్‌లు మాట్లాడుతూ, రాష్ట్రంలో 20 లక్షలకు పైగా దివ్యాంగులు ఉన్నారని, దివ్యాంగ పరిరక్షణ చట్టం 2016 (ఆర్‌పీడబ్ల్యూడీ) ప్రకారం సకలాంగులతో సమాన స్థాయి కల్పించాలని డిమాండ్ చేశారు. మలకపేట హైదరాబాద్ దివ్యాంగుల భవన్ ఆవరణలో బధిరుల ప్రభుత్వ కాలేజీ, డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేసి హాస్టల్ వసతులు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సీఎం, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ పింఛను పెంచడంతో పాటు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమాలు చేపడతామని వారు హెచ్చరించారు. తెలంగాణ వికలాంగుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్, వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకుడు వెంకట్రావ్ మున్నా, టీహెచ్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుత్తికొండ కిరణ్, వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్‌కమిటీ చైర్మన్ గోపాల్, వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్‌కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య, గొని యాదగిరి, మహేష్, మెరుగుశివ హాజరై మద్దతు ప్రకటించారు.

మాలల సింహగర్జన మహాసభను జయప్రదం చేయాలి

చిక్కడపల్లి: పరేడ్ గ్రౌండ్స్‌లో ఆదివారం నిర్వహించే మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఎస్సీసెల్ నగర మాజీ కన్వీనర్ గడ్డం రాజేశ్ పిలుపునిచ్చారు. శనివారం చిక్కడపల్లి వివేక్‌నగర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలలు తమ హక్కులు సాధించుకునే ఉద్యమాలు చేయాలని అదే అంబేద్కర్‌కు అర్పించే నిజమైన నివాళి అన్నారు.

మాలల సింహగర్జన పేరుతో ఎస్సీల ఐక్యతకు విఘాతం

రాంనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవడానికి మాలల సింహగర్జన పేరుతో కొన్ని దుష్టశక్తులు ఎస్సీల ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నాయని ఎమ్మార్పీఎస్ నేతలు ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బైక్ ర్యాలీని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ, వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్‌మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ గెల్వయ్యలు జెండాను ఊపి ప్రారంభించి మాట్లాడారు. కొంతమంది మాలలు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక శక్తులుగా మారి వర్గీకరణ చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గంట సుదర్శన్, భీమ్, రవికిరణ్, యాదగిరి, బాషపాక యాదగిరి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

నేడు పరేడ్ గ్రౌండ్స్ పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మాలల సింహగర్జన సభ సందర్భంగా ఆదివారం సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు ఉంటాయని సిటీ ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8 గంటల వరకు పలు రహదారుల్లో దారి మళ్లింపులు ఉంటాయని, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా, పోలీసులు సూచించిన మళ్లింపుల ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ మళ్లింపు ఉండే ప్రాంతాలు

పంజాగుట్ట-గ్రీన్‌ల్యాండ్స్ నుంచి బేగంపేట, సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్ వైపు వెళ్లే దారిలో అత్యధిక ట్రాఫిక్ రద్దీ ఉండే అవకాశం ఉంటుంది. అలాగే టివోలీ ఎక్స్‌రోడ్ నుంచి ప్లాజా ఎక్స్‌రోడ్డు వరకు రోడ్డును క్లోజ్ చేస్తారు. చిలకలగూడ ఎక్స్‌రోడ్డు, ఆలుగడ్డ బావి ఎక్స్‌రోడ్డు, సంగీత్ ఎక్స్‌రోడ్డు, వైఎంసీఏ ఎక్స్‌రోడ్డు, ప్యాట్నీ ఎక్స్‌రోడ్డు, ఎస్‌బీహెచ్ ఎక్స్‌రోడ్డు, ప్లాజా, సీటీవో జంక్షన్, బ్రూక్ బాండ్ జంక్షన్, టివోలి జంక్షన్, స్వీకార్ ఉపాకార్ జంక్షన్, సికింద్రాబాద్ క్లబ్, త్రిముల్ ఘెరీ ఎక్స్‌రోడ్డు, తాడ్‌బండ్ ఎక్స్‌రోడ్డు, సెంటర్ పాయింట్, డైమండ్ పాయింట్, బోయిన్‌పల్లి ఎక్స్‌రోడ్డు, రసూల్‌పురా బేగంపేట, ప్యారడైజ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని అడిషనల్ సీపీ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ వేగవంతం చేయాలంటూ బైక్ ర్యాలీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని హైదరాబాద్ ఇన్‌చార్జి సుదర్శన్ మాదిగ, వర్కింగ్ ప్రెసిడెంట్ బోడ రవికిరణ్‌లు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణను వేగవంతం చేయాలంటూ ముషీరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బైక్‌ర్యాలీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకశక్తులు వర్గీకరణ చేయకుండా అడ్డుపడుతున్నారన్నారు. మాలల సింహగర్జన పేరుతో కోట్లు వెదజల్లి ఎస్సీల ఐక్యతను దెబ్బతీస్తున్నారన్నారు.



ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులతో నగర సీపీ సీవీ ఆనంద్

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు ఘనంగా వీడ్కోలు

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ పోలీసు ఉద్యోగులు విధి నిర్వహణలో గడించిన అనుభవం వృథా కాకుండా సమాజ హితానికి తోడ్పడాలని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. కమిషనరేట్ పరిధిలో శనివారం పదవీ విరమణ పొందిన 12 మంది అధికారులను కమాండ్ కంట్రోల్‌రూమ్‌లో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సైబరాబాద్ కమిషనరేట్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు అధికారులను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. కుటుంబ సభ్యులతో రిటైర్డ్ జీవితం ఆనందంగా గడపాలని కోరుకున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో పదవీ విరమణ పొందిన ఐదుగురు పోలీసు సిబ్బందిని క్రైం డీసీపీ అరవింద్‌బాబు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

హైదరాబాద్ సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 14న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్ రేణుకయార అన్నారు. శనివారం సిటీ సివిల్‌కోర్టులోని తన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ లోక్‌అదాలత్‌లో మోటార్ వెహికల్ యాక్సిడెంట్, సివిల్, ఇతర కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాజీ మార్గం ద్వారా తమ కేసులను కక్షిదారులు పరిష్కారం చేసుకోవాలని జడ్జి సూచించారు.



తనిఖీలు చేస్తున్న జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు

హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు

హైదరాబాద్‌సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారులు శనివారం హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లతో పాటు బేకరీల్లో నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించారు. చాదర్‌ఘాట్, మలక్‌పేట, గాంధీనగర్ ప్రాంతాల్లో హోటళ్లు, బేకరీ, ఫాస్ట్‌సెంటర్లలో నిబంధనలు పాటించని వారికి నోటీసులు జారీచేశారు. చాదర్‌ఘాట్‌లో సవేరా హోటల్‌లో అపరిశుభ్రమైన ఫ్లోరింగ్, మలక్‌పేటలో కోహిర్స్ అల్లం వెల్లుల్లి యూనిట్‌లో లేబుల్ లేని ప్యాకెట్లు గుర్తించారు. సలీంనగర్‌లో ఓ బేకరిలో కేకులపై వాడే పేస్ట్‌ల తయారీ తేదీలు, వినియోగ తేదీలను ప్రదర్శించాలని నిర్వాహకులను ఆదేశించారు. చిక్కడపల్లి ప్రజ్ఞాభవన్ హాస్టల్‌లో అపరిశుభ్రంగా ఉన్న భోజన ప్రాంతం, అశోక్‌నగర్‌లో స్పైసీ నూడిల్ హౌస్, గాంధీనగర్‌లో మసాలాల్లో రంగులు, మహదేవ్ ఫుడ్‌కోర్టులో గడువు ముగిసిన మసాలాలు, సింథటిక్ రంగులు గుర్తించిన అధికారులు వారికి నోటీసులు జారీచేశారు.

కమనీయం శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నల్లకుంట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ న్యూనల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి దేవాలయంలో కార్తీక మాసం వేడుకలు భక్తిశ్రద్ధతో జరుగుతున్నాయి. మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, ఏక రుద్రాభిషేకం నిర్వహించారు. పురోహితుల మంత్రోచ్చారణల నడుమ శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జమలాపురం గోపాల్‌రావు, ధర్మకర్తలు ఎస్.వెంకటేశ్వరరావు, మధుకుమార్, వై.మురళి, మధుసూదన్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

కనులపండువగా ఉమామహేశ్వర కల్యాణం

చిక్కడపల్లి: కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి ఆలయం ఆవరణలోని పార్వతిక్షీరలింగేశ్వరస్వామి మందిరంలో శుక్రవారం రాత్రి కన్నులపండువగా ఉమామహేశ్వర కల్యాణమహోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్ కుమార్ దంపతులు పూజలు నిర్వహించారు.